గుట్ట లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం

స్ఫటిక లింగేశ్వరుడికి హారతి ఇస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, ఏప్రిల్15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. సోమవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు జరపించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. సీతారామ చందస్వామి వసంత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ. 30,84,826 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే రోజులొచ్చినయ్

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 15 : మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమికొట్టే రోజులొచ్చాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 420 గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి 125 రోజులైనా వాటిని నెరవేర్చలేదని ఆరోపించారు. ఇచ్చిన 420 హామీలను అమలు చేసేవరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను వెంటాడుతామని హెచ్చరించారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్‌పై విమర్శలు మాని ఆలేరును అభివృద్ధి చేసి చూపించాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి డబ్బు సంచులిచ్చి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్న బీర్ల అయిలయ్యపై త్వరలోనే ప్రజావ్యతిరేకత తప్పదన్నారు. వందరోజులు దాటినా ఆలేరు నియోజకవర్గానికి ఒక్క రూపాయి తీసుకొచ్చావా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను శంకుస్థాపన చేస్తూ కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లోని రైతాంగం కాంగ్రెస్ పాలనను ఎండగడుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఓటు వేసి తప్పు చేశామని పునరాలోచనలో పడ్డారని అన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, బీఆర్ఎస్ యువజన నాయకుడు కిరణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

తరగతి గదులకు ఐరన్ గ్రిల్స్ బహూకరణ

రాజాపేట, ఏప్రిల్ 15 : మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని డిజిటల్ తరగతి గదుల రక్షణ కోసం 1960-70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం రూ.20 వేల విలువైన ఐరన్ గ్రిల్‌ను బహూకరించారు. అలాగే అదే పాఠశాలలో పనిచేసే జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు యారాల నిరంజని రూ.10 వేల విలువైన ఐరన్ గ్రిల్ అందజేశారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూర్గు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రాజాపేట జడ్పీ హైస్కూల్ డిజిటల్ తరగతి గదికి ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్

ఎన్నారం పాఠశాలకు కుర్చీలు..

రామన్నపేట : మండలంలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన కీ.శే. నల్ల మాసిరెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం15 కుర్చీలు, టిపాయ్ అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి 5 కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమాదేవి, నరేందర్‌రెడ్డి, జ్యోతి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీపీ

ఆత్మకూరు(ఎం) సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మంగమ్మ

ఆత్మకూరు(ఎం),ఏప్రిల్15 : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ తండ మంగమ్మాశ్రీశైలంగౌడ్ సూచించారు.

సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సంబంధిత శాఖ అధికారులంతా నిత్యం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ నిరంజన్‌వలీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని వీధి దీపాలకు ఆన్-ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఆత్మకూరు(ఎం) ఎంపీటీసీ యాస కవిత మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మ, ఎంపీఓ పద్మావతి, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ఏఈ సునీత, ఏపీఎం కిరణ్, ఎంపీటీసీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, హంసమ్మ, కోఆప్షన్ సభ్యుడు యూసుఫ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ పల్టీ.. బాలుడి మృతి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 15 : ట్రాక్టర్ పల్టీ కొట్టి బాలుడు మృతి చెందగా, మరో బాలుడికి తీవ్రగాయలైన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని ధర్మారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయ ఉత్సవాలు మూడు రోజులుగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన సుర్వి నాగరాజు కుమారుడు కౌశిక్ హయత్‌నగర్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలకు కౌశిక్‌తోపాటు అతని స్నేహితులు ఐదుగురు గ్రామానికి వచ్చారు. సోమవారం సాయంత్రం స్నేహితులంతా కలిసి గ్రామ శివారులోని చెరువుకట్ట వద్ద సరదాగా ట్రాక్టర్ నడుతుండగా అదుపుతప్పి పల్టీ కొట్టింది. దాంతో ట్రాక్టర్ నడుపుతున్న యూపీకి చెందిన శివం(16) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బాలుడు సాయి ట్రాక్టర్ ఇంజిన్ కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మిగతా నలుగురు ట్రాక్టర్ పైనుంచి దూకడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. గాయపడిన సాయిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ జెరుషాలోమ్

వలిగొండలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ జెరుషాలోమ్

వలిగొండ, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని అదనపు కలెక్టర్ బెన్ని జెరుషాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన లారీల్లో ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి మిల్లులకు పంపించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి గోపీకృష్ణ, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి వహీద్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి రైతులు పండించిన ధాన్యాన్ని ఏ-గ్రేడ్ కింద కొనుగోలు చేయాలి

● సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 15 : భూదాన్‌పోచంపల్లి మండల వ్యాప్తంగా పండించిన వరి ధాన్యాన్ని ఏ-గ్రేడ్ కింద కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచంపల్లి మండల రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఏ-గ్రేడ్ కింద కొనుగోలు చేయాలని సోమవారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోచంపల్లి మండల రైతులు మూసీ జలాలతో వరి పండిస్తున్నారనే పేరుతో గత రెండు సీజన్ల నుంచి నుంచి ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొనుగోలు చేయడం సరికాదని అధికారులను ప్రశ్నించారు. 75 శాతానికి పైగా రైతులు మూసీ కాల్వల నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి సంవత్సరము 27 నుంచి 35 వేల ఎకరాల భూమిని సాగు చేసి 7 నుంచి 8 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని పండిస్తున్నట్లు గుర్తుచేశారు. అధికారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై బి-గ్రేడ్ కింద ధాన్యం కొనుగోలు చేయడం దారుణమన్నారు. పోచంపల్లి రైతుల సమస్య పరిష్కారం కాకపోతే సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పోచంపల్లి మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ మధు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 15 : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలోని తాపీ సంఘం భవనంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కార్మికులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. 60 ఏండ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, పెండింగ్ క్లెయిమ్స్, బెనిఫిట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు, సహజ మరణం పొందితే రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా చేరాల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా దేవిగారి బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కొత్త నరేశ్, సహాయ కార్యదర్శిగా రామచర్ల సందయ్య, కోశాధికారిగా పోతగళ్ల బాలరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, పెద్దల యాదయ్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వైన్స్ యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే చర్యలు

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

పొట్టిమర్రి వైన్స్‌లో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

రాజాపేట, ఏప్రిల్ 15 : వైన్స్ యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని రాజాపేట, రఘునాథపురం పొట్టిమర్రిలోని వైన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐలు దీపిక, రాధాకిషన్, ఎస్ఐలు విజయ్, నిరోషా, సిబ్బంది ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా రాహుల్

ఈర్ల రాహుల్,

సిరికొండ భవ్య

భువనగిరి సిటీ, ఏప్రిల్ 15 : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యురాలు సిరికొండ భవ్య అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో జిల్లా కమిటీలో వారు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, భువనగిరి, చౌటుప్పల్, మోత్కూర్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు.

నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

యజ్ఞంలో పాల్గొన్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 15 : పట్టణ కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయ పునఃనిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గునిగంటి మల్లేశంగౌడ్, కట్కూరి పాండు, శ్రీరాములు, శివకుమార్, బాలయ్య, వెంకటేశం, పోచయ్య, శ్రీనివాస్, నర్సింహ, కృష్ణ, రామకృష్ణ, లింగం, రాజారమేశ్, చంద్రశేఖర్, రమేశ్, రాజు, పెంటయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

● డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 15 : జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీసీపీ రాజేశ్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ నెల 15వ వరకు జిల్లాలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పట్టుబడిన రూ.19,08,669 నగదు, 2,402 లీటర్ల మద్యం, 5.58 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా ఎవరైనా అధిక మొత్తంలో డబ్బు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పుస్తెలతాడు చోరీ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 15 : డాబాపై నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లిన సంఘటన పట్టణ పరిధిలోని రాయగిరిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన మద్దూరి శిరీష రాయగిరిలో జరిగిన దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి ఇంటిపై నిద్రించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో శిరీష మెడ నుంచి 2 తులాల పుస్తెలతాడుతోపాటు పక్కనే నిద్రిస్తున్న కొమ్ము మాధవి మెడ నుంచి రోల్డ్‌గోల్డ్ పుస్తెలతాడును లాక్కెళ్తుండగా తేరుకున్న మహిళలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి రిమాండ్

అడ్డగూడూరు, ఏప్రిల్ 15 : దొంగతనం కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. గత నెల 17న పలు ఇండ్లల్లో దొంగతనాలు జరుగడంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులను చాకచక్యంగా పట్టుకొని విచారించడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 2 తులాల బంగారం, రూ.5 వేల నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. నిందితులు దాసరి మురళి, అంగిడి జంపయ్య మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా వీరిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు, వీరిని రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

19 మంది గురుకుల విద్యార్థుల డిశ్చార్జి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 15 : భువనగిరి ప్రభుత్వ ఏరియా దవాఖానలో ముగ్గురు విద్యార్థులు చికిత్స పొందుతున్నట్లు ఏరియా దవాఖానా సూపరింటెండెంట్ చిన్నానాయక్ సోమవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి సోమవారం వరకు మొత్తం 25 మంది విద్యార్థులు భువనగిరి ఏరియా దవాఖానలో అడ్మిషన్ పొందగా 15 మంది డిచ్చార్జి అయినట్లు చెప్పారు. మూడురోజుల క్రితం ఏడుగురిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా వారిలో నలుగురు విద్యార్థులు డిచ్చార్జి కాగా ఇద్దరు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. మరో విద్యార్థి సీహెచ్ ప్రశాంత్ వెంటిలేషన్ పైనే ఉన్నట్లు తెలిపారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, ఏప్రిల్ 15 : భక్తిభావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రామునిబండపై కొలువైన సీతారాముల స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభం, వశిష్ఠ మహర్షి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపురం-జామచెట్లబావి గ్రామాల మధ్య రామునిబండపై కొలువైన సీతారామ, లక్ష్మణ, హనుమంతుల వారి ఆశీస్సులతో గ్రామస్తులు ఐక్యమత్యంగా ఉంటున్నట్లు గుర్తుచేశారు. ఇలాంటి ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ దబ్బేటి విజయారమేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్ గెలుపు ఖాయం

● బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ సెక్రటరీ జనరల్ జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నియోజకవర్గ సెక్రటరీ జనరల్ జహంగీర్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 15 : భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్‌వీ ఆలేరు నియోజకవర్గ సెక్రటరీ జనరల్ బండ జహంగీర్ అన్నారు. సోమవారం మండలంలోని పటేల్‌గూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్ పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని, వారికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకులు వస్పరి ఐలయ్య, బండ రమేశ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు వలంటీర్లు కృషి చేయాలి

ఆత్మకూరు(ఎం) టి.రేపాకలో గస్తీ తిరుగుతున్న వలంటీర్లతో కానిస్టేబుల్ శ్రీను

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్15 : గ్రామాల్లోని యువకులంతా స్వచ్ఛందంగా వలంటీర్లుగా రాత్రిపూట గస్తీ తిరుగుతూ దొంగతనాలను అరికట్టేందుకు కృషి చేయాలని ఎస్ఐ నాగరాజు సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో గస్తీ తిరుగుతున్న వలంటీర్లను కలిసి పలు సూచనలు చేశారు.

వలంటీర్లు అర్ధరాత్రి దాటే వరకు గస్తీ తిరుగుతూ ప్రజలకు రక్షణగా ఉండాలన్నారు. డాబాలపై, ఆరుబయట నిద్రిస్తున్న మహిళలను ఇంట్లో పడుకునేలా సూచనలు చేయాలన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చౌటుప్పల్, ఏప్రిల్ 15 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అనిల్‌కుమార్, సిబ్బంది జితేంద్రకుమార్, ప్రసాద్, పాండు, నర్సింహ పాల్గొన్నారు.

చౌటుప్పల్ తాసీల్దార్ కార్యాలయానికి తాళం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 15 : తాసీల్దార్ కార్యాలయానికి తాళాలు వేసిన సంఘటన సోమవారం చౌటుప్పల్‌లో జరిగింది. చౌటుప్పల్ తాసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం ఉన్నప్పటికీ 2020లో భారీ వర్షాలు రావడంతో భవనం చెరువులో మునిగిపోయింది. దాంతో రషీద్ అనే వ్యక్తికి చెందిన అద్దె భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి భవనానికి అద్దె డబ్బులు చెల్లించడం లేదని యజమాని సోమవారం తాళాలు వేశాడు. దీనిపై తాసీల్దార్ హరికృష్ణ స్పందిస్తూ భవన యజమానికి 2022 వరకు డబ్బులు ఇచ్చామని, 2023కు సంబంధించి డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు.

ఘనంగా గంగదేవమ్మ పండుగ


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలో సోమవారం యాదవ కులస్తులు గంగదేవమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాదయాదగిరి, నాయకులు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, కక్కిరేణి వెంకటేశ్వర్లు, ముక్కాముల శేఖర్, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు యాదగిరి, గట్టిగొర్ల సత్తయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పూజలు

గంగదేవమ్మ పండుగలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, నాయకులు పెద్ది బాలనర్సయ్య, అంతటి శ్రీను, అంజయ్య, మనోహర్ పాల్గొన్నారు.